# బస్సు మళ్లీ బయలుదేరింది

శంకరం భవిష్యత్తుకు సంబంధించిన మనిషి. అతను ఎప్పుడూ జరగబోయే దాన్ని గురించి ఆలోచిస్తాడు. గతం అతన్ని బాధించదు. వర్తమానం అంతకంటే అడ్డం రాదు. ఆఫీసులో కూర్చున్నప్పుడు కూడా రేపు తాను చేయవలసిన పనిని గురించే ఆలోచనలు ముసురుకుంటాయి. తనకింద ఎకౌంటెంట్లు, గుమాస్తాలతో మాట్లాడేటప్పుడు ప్రతి కాగితం మీదనూ ముందు ముందు చేయవలసిన పనులను గురించి ప్రస్తావిస్తాడు. ఇంటి దగ్గర భార్యతోనూ అంతే! రేపు ఆమె చేయవలసిన వంటకాలను గురించి వచ్చే పండుగ సందర్భంలో ఆమె కొనవలసిన బట్టల రంగులను గురించి మాట్లాడతాడు. ఇవాళ డైనింగ్ టేబుల్ దగ్గర ' రోజు ఎలా గడుస్తుంది' అన్న ఇబ్బంది లేకపోవడం వల్ల భవిష్యత్తును గురించిన అతని ఆలోచనలకు ఎటువంటి అంతరాయం లేకుండా పోయింది.

అతనికో విచిత్రమైన అలవాటు ఏర్పడిపోయింది. ఏ మనిషిని చూచినా వర్తమానం ఒకటి రెండు క్షణాలలోనే ఎదిగిపోయి అతని భవిష్యత్ స్వరూపమే కనిపిస్తుంది. భవిష్యత్తును గురించిన ఆలోచనలలో విపరీతంగా కూరుకుపోయి నందువల్లనే ఈ అలవాటు అయింది.

బ్యాంకులో జాయిన్ అవటానికి ఒక కొత్త గుమాస్తా వచ్చి అతన్ని కలుసుకుంటా డనుకోండి. అతను "సర్ నేను ఫలానా ఈ రోజున మీ బ్రాంచీలో జాయిన్ అవుతున్నాను" అంటాడు. శంకరం ఈ మాటలు విన్న ఉత్తర క్షణంలోనే చాలా ముందుకు దూకేస్తాడు. ఒక్కమారు ఆ కొత్త గుమాస్తా ముఖం. చూడడంతోటే "ఇతను ఇవాళ జాయిన్ అవుతున్నాడు. రెండు మూడేళ్ళలో పరీక్షలన్నీ ప్యాసయిపోతాడు.

ఎకౌంటెంట్ ఉద్యోగం అందుకుంటాడు. మరో పదేళ్ళలో నాలా మేనేజరు అయిపోతాడు. ఒకవేళ నా దగ్గర మరో బ్రాంచీలో చార్జి అప్పచెప్పుకున్నా ఆశ్చర్యం లేదు" అనేంత వేగిరం వెళ్ళిపోతుంది అతని ఆలోచనా పరంపర.

తన ముందు నిలుచున్నది కొత్తగా గుమాస్తాగా జాయిన్ అవుతున్న కుర్రవాడు కాక తన వద్ద చార్జీ తీసుకోబోతున్న కొత్త మేనేజర్ అన్నట్లుగానే ప్రవర్తిస్తాడు రెండో క్షణం నుంచి. అందువల్ల అతనికి అందరితోనూ గౌరవంగా మర్యాదగా మాట్లాడతాడనీ, తాను పెద్ద వాడిననే అహంకారం అణుమాత్రమైనా లేదనీ మంచి పేరు వచ్చేసింది. అవతలి మనుషులకు లేనిపోని పెద్దరికం చుట్టబెట్టి కొన్ని మార్లు చిక్కుల్లో ఇరుక్కున్న సందర్భాలు కూడా వున్నాయి. అందుకనే అతను అవసరం అయితే తప్ప ఎదురుగా ఉన్న మనిషి ముఖంలోకి చూడకుండా ఉండడం అలవాటు చేసుకున్నాడు.

✧ ✧ ✧

ఒక రోజు శంకరం సిటీబస్‌లో ప్రయాణం చేయవలసి వచ్చింది. సాధారణంగా అతను బ్యాంక్‌కు కారులోనే వెడతాడు. పెట్రోలు ధర పెరిగిపోయిన తర్వాత కూడా ఆఫీసులకు స్వంత కార్లలో వెడుతున్న బహుకొద్ది మందిలో అతనొకడు. ఆ రోజు భార్య ఎక్కడికో దూర ప్రాంతానికి వెళ్లవలసి వచ్చింది. వెల్లింగ్‌టన్ ఆసుపత్రిలో ఆమె తాలూకు దూరపు బంధువు ఎవరో వైద్య నిమిత్తం చేరారు. వాళ్లను చూచిరావడానికి ఆమెకు అంతకంటే సదుపాయం అయిన సమయం కుదరలేదు. భార్యను అక్కడ డ్రాప్ చేసి తను బ్యాంక్‌కు వెళ్లి పోదామంటే అది ఉత్తరం, ఇది దక్షిణం, అయినా తనకు బంధువులను చూడాలనిపించలేదు. పైగా బ్యాంక్ టైం ముందు ఇటువంటి పనులు పెట్టుకుంటే తరువాత ఇరకాటంలో పడాల్సి వస్తుంది. అందుకని అతను భార్యతో "నువ్వు కారు తీసికెళ్లు. నేను టాక్సీలోనో, ఆటోలోనో వెడతాను ఈ రోజుకు. లంచ్ టైమ్‌కు నువ్వు బ్యాంక్‌కు రా, ఇద్దరం కలిసి ఇంటికి వద్దాం" అన్నాడు.

శంకరం ఇంటి నుంచి బయలుదేరాడు. ఒక ఫర్లాంగు దూరంలో టాక్సీలు, ఆటోలు ఆగే స్టాండు ఉన్నది. అయితే అక్కడకి చేరడానికి ముందే బస్‌స్టాప్ ఉంది. తీరా ఆ రోజు అతను బస్‌స్టాప్‌కు చేరుకునే సరికి అక్కడో బస్సు కదలడానికి సిద్ధంగా ఉంది. లోపల చాలా సీట్లు ఖాళీగా ఉన్నాయి. తగినంత సమయం విరామం వున్నది గదా బస్‌లో ఎందుకు పోకూడదు అనుకున్నాడు. చెంగున గెంతువేసి బస్సు లోపల

వచ్చాడు. ఇద్దరు ప్రయాణీకులు కూర్చునే సీటు ఆకుపచ్చ రంగులో అతన్ని ఆహ్వానించింది. తాపీగా కూర్చున్నాడు. బస్ బయలుదేరింది.

రెండు నిమిషాలు గడిచాక శంకరం తన పక్క సీట్ వంక చూశాడు. ముగ్గురు కూర్చోవలసిన సీటు. అయితే ఇద్దరే కూర్చున్నారు. బస్‌లన్నీ సాధారణంగా రద్దీగా వుంటాయని పేరు గదా! ఇవాళ ఇదేమిటి ఇంత ఖాళీగా వున్నాయి అనుకుంటూనే శంకరం ఆ ఇద్దరినీ తాపీగా గమనించాడు.

ఆ కుర్రాడికి పదమూడు పధ్నాలుగేళ్ళు వుంటాయి. అమ్మాయికి ఎనిమిది తొమ్మిది కంటే ఎక్కువ వుండవు. పాలిస్టర్ ఎర్ర పువ్వుల చొక్కా తొడుక్కున్నాడు. గోధుమ రంగు ప్యాంటు టక్ చేశాడు. కుర్రాడి ముఖం కళకళ లాడుతూ వుంది. బడికి వెడుతున్న కుర్రాడు కాదు. ఎందుకంటే చేతిలో పుస్తకాల సంచి, టిఫిన్ బాక్స్, నీళ్ళ సీసా లేవు.

అమ్మాయి నీలంరంగు ఫ్రాక్ వేసుకుంది. అదే రంగు గాజులు, పోనీటెయిల్‌లా ముడిచింది జుట్టు. మళ్ళీ నీలం రంగు రిబ్బనే. ముఖం ఆనందంగా మెరిసిపోతోంది. ఇలాంటి పిల్లలను చూస్తే ఎవరికయినా ముచ్చటగానే వుంటుంది. ఈ ఆనందాన్ని, సంతోషాన్ని ముందు ముందు తమ జీవితాలలోకి నిరాఘాటంగా తీసుకు పోగలుగుతారు. చిన్నతనంలో జీవితం ఎంత కులాసాగా గడిచిపోతే ఆ ఈజ్ తరువాత రోజులకూ విస్తరిస్తుంది.

శంకరం రెండు క్షణాలు ఇద్దర్నీ చూశాడు. మనసులో మురిసిపోయాడు. అతని హృదయ కవాటాలు - ఆలోచనా మందిర ద్వారాలు యథా ప్రకారంగా తెరుచుకున్నాయి. ఆ అబ్బాయి ఇంకా ఏ హైస్కూల్లోనో చదువుతూ వుండి వుంటాడు. మంచి ఇంగ్లీషు మీడియం బడిలో చదివితే కుర్రాడు చాకులాగ తయారవుతాడు. అయిదారేళ్ళలో డిగ్రీ పూర్తి చేసుకుంటాడు.

అమ్మాయి లక్షణంగా ఉంది. చదువుతోపాటు సంగీతం, నాట్యం కూడా నేర్పిస్తే వయస్సు వచ్చేసరికి హేమమాలినిలా తయారవుతుంది. సందేహం లేదు. సినిమాలకు పనికి వచ్చే ఫోటో జెనిక్ ఫేస్. తప్పదు... మరో పదేళ్ళ తరువాత తను ఏదేనా సినిమాకు వెళ్లడం తటస్థిస్తే - ఈ ముఖమే స్క్రీన్ మీద సాక్షాత్కరిస్తుంది.

స్ఫురద్రూపి అయిన కుర్రాడు. మాంచి టెన్నీస్ ఆటగాడు. మేనేజ్‌మెంట్ కోర్సులో ఇప్పుడే పోస్టు గ్రాడ్యుయేషన్ అయింది. నేడో రేపో మంచి ఉద్యోగం

అవుతుంది. బిజినెస్ ఎగ్జిక్యూటివ్, నాలుగు అంకెల జీతానికి యేం ఢోకా లేదు. పైగా ఎన్నో పెర్క్సు...

అతని పక్కన ఆ అమ్మాయి. నిజానికి ఇద్దరూ చిలకా గోరింకల్లా వున్నారు. అమ్మాయి చాలా అప్ టు డేట్‌గా ఇంటీరియర్ డెకరేషనులో డిగ్రీ హోల్డర్‌లాగా ఉంది. అమ్మాయిని చూస్తూనే కాలం గడిపివేయవచ్చు. ఇటువంటి సుందర విగ్రహంతో కాపురం చెయ్యడానికి ఎవరయినా సిద్ధపడతారు. అందులో అతనూ ఆ అమ్మాయికి అన్ని విధాల సరితూగేవాడు... అసలు ఇద్దరికీ ఎల్లా పరిచయం అయింది? సినిమా హాల్లోనా, కాలేజీలోనా, లేక కాఫీ హోటల్లోనా?

ఇద్దరికీ ఎలాగో పరిచయం అయి ఉంటుంది.

పరిచయం పెరిగి ఒకళ్లమీద ఒకళ్లకు ఆరాధన పెరిగింది. ఆరాధనను అనవతరం నిలుపుకోవాలనుకున్నారు. అందుకు తేలిగ్గా కనిపించేది ఒకటే మార్గం, పెళ్ళి. ఇద్దరికీ పెళ్ళీఈడు  వచ్చింది. పెళ్లంటే అర్థం చేసుకునే చదువు, తెలివి! సంస్కారం చక్కగా నిర్వహించుకోగల చాకచక్యం వున్నాయి.

ఇద్దరూ పెళ్లిచేసుకుందామని తీర్మానించుకున్నారు. కాని... సినిమాలలోలా, కథలలోలా-ఏదో ఆటంకం. కట్న పిశాచమో, కులాల భూతమో ఇద్దరికీ నడుమ కంచుగోడలా నిలవడానికి తయారయింది.

మంచితనానికి, లాలిత్యానికి ఇవి రోజులు కావు.

పసివాళ్ల హృదయాలను అర్థం చేసుకునే తల్లిదండ్రులు ఇంకా అవతరించలేదు. కుర్రవాళ్లమాటను కాదనకుండా ఆశీర్వదించే పెద్దలకు ఇంకా కరువు గానే ఉంది. అబ్బాయి, అమ్మాయి పరస్పరం అన్ని విధాలుగానూ ఒకటయిపోవటానికి అంగీకరించి వర్తించినా పెద్దవాళ్ళు ఏవో అభ్యంతరాలు కల్పించి... వాళ్లను వేరుచేయాలని చూస్తున్నారు.

కాని అబ్బాయి సామాన్యుడా! అమ్మాయి అంత తెలివితక్కువదా? మా మాటకు తిరుగులేదన్నారు. ప్రపంచం అంతా ఎదురయి వచ్చినా మేం పెళ్లాడి తీరుతాం అన్నారు. మీరు ఇష్టపడినా, పడకపోయినా మా వర్తనంలో ఏమీ వ్యత్యాసం లేదని ఢంకా బజాయించి చెప్పారు. అమ్మాయికి ముందు అంత పట్టింపు లేకపోయినా, తల్లిదండ్రులు వీలుకాదన్నారు గనుక వాళ్లకు ఎదురు తిరిగితే యెట్లావుంటుందో చూద్దామని ఉత్సుకతకొద్దీ అబ్బాయి పక్కన అతుక్కుపోయినట్లు చేరింది.

శంకరం 'సింపతీస్' అన్నీ ఆ ఇద్దరిచుట్టూ ఆవరించుకున్నాయి. తను కూడా కలుగజేసుకుని యెలాగయినా ఈ పెళ్లి జరిపించి తీరాలన్నంత పట్టుదల వచ్చేసింది. ఆ అబ్బాయి, అమ్మాయి ఏమీ మాట్లాడటం లేదు. అయినా తనవంక దీనంగా చూచి నీవే మమ్మల్ని తరింపచేయాలి అంటున్నట్లు అనిపించింది.

సన్నగా బెల్ మోగింది.

ఆలోచనలకు అంతరాయం కలిగినట్లయింది.

బస్ ఆగింది.

నీలంరంగు అమ్మాయి లేచి నిలబడింది. పక్కనున్న అబ్బాయిని బుజాలు పట్టుకుని కుదుపుతూ 'ఇంకా ఆలోచిస్తున్నావు ఏమిట్రా అన్నాయ్. మన స్టాప్ వచ్చేసింది. లే-లే' అంది. పరధ్యానంగా వున్న అబ్బాయి లేచి జుట్టు సరిచేసుకున్నాడు.

ఇద్దరూ ఒకరి వెనకాల ఒకరు బస్ దిగారు. రోడ్డుమీదికి దిగి ముందుకు సాగిపోయారు.

బస్ మళ్ళీ బయలుదేరింది.

❖